# బాధితుడు

"దౌర్భాగ్యపు వెధవా! నువ్వేరా ఊరుకు నాశనం తెచ్చావ్!" అంటూ శివాలయం ముందున్న మండపంమీద నుంచి నిప్పులు కక్కుతూ, సాంబయ్య ఎదురుగా నుంచున్న బాపయ్యమీదకు వొక్క దూకు దూకాడు.

సాంబయ్య చేతికర్ర గాల్లో రివ్వున తిరిగి బాపయ్య భుజాలపైన వాలింది.

నివ్వెరపోయిన బాపయ్య నిలువుగుడ్లేసి శరీరాన్ని వడుపుగా మీదకుదూకుతున్న సాంబయ్య కర్ర కప్పచెప్పి నుంచున్నాడు.

★ ✳ ★

దాదాపు యిరవై సంవత్సరాల నాటిమాట. బాపయ్య, అక్కడే ఆ శివాలయం ముందే పోలీసు లాఠీకి వళ్ళప్పగించి నుంచున్నాడు.

"ఈ ఊరికంతా నాయకుడు యీడేనంట సార్!" అన్నాడు పోలీసు, బాపయ్య గూళ్ళసందున లాఠీతో డుస్తూ.

"అవునోయ్! వీడే ఊగుకు ముసలం పెట్టాడు! ఊఁ, చూస్తారేం?" పోలీసు ఆఫీసరు మాట పూర్తికాకముందే, బాపయ్య కాళ్ళపైనా, పిక్కలపైనా పోలీసుల లాఠీలు నాట్యం చేసినయ్.

"భారతమాతకూ జై!"

"మహాత్మాగాంధీకీ జై!"

"తెల్లప్రభుత్వం నశించాలి!"

పోలీసులు వలయాకారంలో బాపయ్యను చుట్టి వేశారు.

బోనులో బంధించబడ్డ సింహంలాగా గర్జించాడు బాపయ్య. ఎలుగెత్తి నినాదం చేశాడు.

పోలీసులు బాపయ్యను నెట్టుకొంటూ ముందుకు నడిచారు. కాని బాపయ్య గొంతెత్తి అరుస్తూనే వున్నాడు.

"తెల్ల ప్రభుత్వం నశించాలి!"

శివాలయం గోపురం ప్రతిధ్వనించింది. పోలీసుల్ని చూసి చెల్లాచెదురై పారిపోతూన్న జనం ఆగి నిలబడ్డారు. కొంతమంది తిరిగి ముందుకొచ్చారు. బాపయ్య యిచ్చిన నినాదాల్ని అందుకొన్నారు. పిడికిళ్ళు బిగించి గొంతెత్తి అరిచారు.

"తెల్లప్రభుత్వం నశించాలి!"

"గాంధీమహాత్మాకు జై!"

"భారతమాతకు జై!"

మిట్ట మధ్యాహ్నం ఎండలో, పోలీసుల ఎర్రటోపీలూ, బెల్టులూ, లాఠీలూ మెరిసినై.

ముందుకు తోసుకువస్తోన్న జనాన్ని ఆపి, వెనక్కు తరిమికొట్టారు.

శివాలయం దగ్గర్నుంచి బాపయ్యను వీధినే నడిపించి తీసుకువెళ్ళారు పోలీసులు. పెద్దబజార్లో పోలీసువాన్ ఎక్కించారు.

పోలీసులమధ్య నడిచి వెళ్తున్న బాపయ్యను వేలాది ప్రజలు వీధుల్లో నిలబడి మౌనంగా, దిగులుగా చూచారు.

ఆడాళ్ళు వాకిళ్ళలో నిలబడి, గోడలమీదుగానూ తొంగి తొంగి చూశారు.

బాపయ్యను ఎక్కించుకొని పోలీసువాన్ కదులుతూండగా పోలీసుల మధ్య నుంచొని బాపయ్య, చేతులు జోడించి జనాన్ని చూసి, చిరునవ్వు నవ్వుతూ శెలవు తీసుకొన్నాడు.

"బాపయ్య జిందాబాద్ !"

"బాపయ్య జిందాబాద్ !"

చెదురుగా కొందరు యువకులు నినాదాలు యిచ్చారు.

వాన్‌లో పోతూన్న బాపయ్య చెవుల్లో గింగురుమన్నాయి ఆ నినాదాలు.

బాపయ్య యువక హృదయంలో వుత్సాహం వెల్లివిరిసింది. దేశసేవానిరతిలో వున్మత్తుడయాడు. గాంధీజీని యెంతగా ప్రేమించాడో తెల్లప్రభుత్వాన్ని అంతగా ద్వేషించాడు బాపయ్య.

ఊరు ఊరూ కదిలింది. తను కనీ వినీ ఎరుగని సంచలనం ఊళ్ళోని ప్రజల్లో కలిగించగలిగాడు. తన వెనకే జనం అంతా కదిలి వస్తారు. స్వరాజ్యం కోసం పోరాడుతారు, అనుకున్నాడు బాపయ్య.

ఉద్రేకం మత్తులో మునిగిపోయిన బాపయ్యకు, మోకాళ్ళమీద, శీలమండలమీద తగిలిన దెబ్బలు నొప్పి పెట్టలేదు. పైగా హృదయం కొంత తేలికపడినట్లుగా వుంది.

బాపయ్యకు తన వంటిమీద లాఠీదెబ్బలు పడుతూంటే, భారతమాతకు సంకెళ్ళు పటపటా, తెగిపోతూన్నట్లే అనిపించింది. పోలీసుల కుమ్ముపోట్లకు వళ్ళు నెప్పెట్టినకొద్దీ మనసు తేలికపడుతూన్నట్టయ్యేది. గాంధీజీ అదృశ్యంగా ఆ స్థలంలో నిలబడి తను తింటూన్న లాఠీ దెబ్బల్ని చూస్తోన్నట్టే వుండేది.

వీటన్నిటికన్నా, "బాపయ్య జిందాబాద్!" అని యువకుడు వేసిన కేకలకు బాపయ్య వళ్ళు పులకరించింది.

గాంధీజీ పిలుపునందుకొని బాపయ్య శాసనోల్లంఘనంచేసి అరెస్టయాడు. వూళ్ళో స్వరాజ్యంకోసం అరెస్టయిన ప్రథమవ్యక్తి బాపయ్యే!

బాపయ్య అరెస్టుతోనే ఆ వూళ్ళో రాజకీయాలు ప్రవేశించాయి. ప్రజల్లో చైతన్యం మామూలావున్న అలజడి కలిగింది. యువకులు కొంతమంది వుద్యమంలోకి దూకారు. బాపయ్య అడుగుజాడల్లోనే నడిచి యింకో పదిమందిదాకా జైళ్ళకు పోయారు.

ఏడాది శిక్ష అనుభవించి అలీపూర్ జైలునుంచి వచ్చాడు బాపయ్య. గ్రామస్థులంతా బ్రహ్మాండమైన స్వాగతం యిచ్చి పూలమాలలు వేసి ఊరేగించారు.

జైలుకు పోయొచ్చాక యింకా కొన్నిసంగతులు తెలిసినట్టయింది బాపయ్యకు. జైలుకు పోవడంగాని స్వరాజ్యం

తీసుకురావడంగాని అనుకొన్నంత కష్టంకాదని అభిప్రాయపడ్డాడు.

గాంధీజీ సాగించిన ప్రతి వుద్యమంలోనూ పాల్గొన్నాడు. గాంధీజీ పిలుపు యిచ్చినప్పుడల్లా జైలుకుపోయాడు. గాంధీజీ జైలునుంచి బయటకొచ్చినా, బాపయ్యమాత్రం ఆరునెల్లూ, సంవత్సరంపాటు అదనంగా జైలుశిక్ష అనుభవించి బైటికి వస్తూండేవాడు.

వుద్యమం ఊళ్లో అలా అలా బాగా పాకిపోయింది. పదీ పదిహేనుమందిదాకా ప్రతిసారీ వుద్యమంలో దూకి శాసనోల్లంఘనంచేసి జైలుకు పోతూండేవారు—

—స్వరాజ్యం వచ్చింది!

బాపయ్య తన త్యాగం ఫలించిందనుకొన్నాడు!

బాపయ్య తన కళ్ళముందే ఎన్నోమార్పులు జరగటం చూశాడు. దేశానికి స్వరాజ్యం యిచ్చి బ్రిటిష్‌వాళ్ళు వెళ్ళిపోయాక జనం అంతా హాయిగా కాలుమీద కాలు వేసుకొని యింట్లో కూర్చోవచ్చనుకొన్నాడు. కాని ప్రజల్లో అలజడీ, ఆందోళనా, అశాంతి రోజురోజుకూ పెరిగిపోతూవుంది. చాలా పార్టీలు పుట్టుకొచ్చాయి. అనేకమంది నాయకులు వెలిశారు.

బాపయ్య జైలుకుపోయిన రోజుల్లో యిన్ని పార్టీలు లేవు; యింతమంది నాయకులూ లేరు. వున్నదల్లా వొకటే వెల్లువలాటి వుద్యమం. దానికి గాంధీజీ నాయకుడు. తనలాటి వాళ్ళంతా సైనికులు. ఖద్దరుమీద ప్రేమ, దేశంమీద భక్తి అవే వాళ్ళ ఆయుధాలు. వాటితోనే పరాయి ప్రభుత్వపు లాఠీల్నీ, జైళ్ళను ఎదుర్కొన్నారు.

బాపయ్య అనుకోననివీ, ఊహించనివీ చాలా జరిగి పోయినై. హరిజనులకు దేవాలయ ప్రవేశంకోసం ఆ రోజుల్లో తను ఆందోళన చేశాడు. దేవాలయ ప్రవేశం మాటెలా వున్నా, పంచాయితీబోర్డు మెంబర్లూ ప్రెసిడెంట్లూ అయి పోతూన్నారు వాళ్ళు.

తను మొదటిసారి జైలుకు పోయిన రోజుల్నాటికి పుట్టనివాళ్ళంతా, యిప్పుడు రాజకీయాలు మాట్లాడు తున్నారు. పైగా తనకు తెలియని సంగతులు మాట్లాడు తున్నారు. ఆ రోజుల్లో వుద్యమంలో తామంతా వేసిన తప్పటడుగుల్ని గురించి తనతో వాదిస్తోన్నారు!

'కాలం మారిపోయింది!' అనుకొన్నాడు బాపయ్య.

ఆ రోజుల్లో బాపయ్యతోపాటు జైలుకుపోయిన వాళ్ళల్లో కొందరు నిజంగానే స్వరాజ్యఫలాన్ని అందుకొని అనుభవించసాగారు. ఆ మాటకొస్తే స్వరాజ్యం వచ్చాక కాంగ్రెసులో చేరినవాళ్ళల్లో కొందరు శాసన సభాసభ్యులు, మంత్రులూ అయిపోయారు.

బాపయ్యకు మిగిలిందల్లా, ఆ వూళ్ళో మొట్టమొదటి సారిగా జైలుకు పోయొచ్చాడన్న పేరూ, కీర్తి;తండ్రి యిచ్చి పోయిన పదిహేనెకరాల ఆస్తిలో మూడెకరాలు.

బాపయ్యకు వయసుతోపాటు కుటుంబభారం పెరిగి పోయింది. వున్న ఆస్తి తగ్గిపోయింది. ఖర్చులు పెరిగిపోయినై. గతాన్ని నెమరువేసుకొంటూ బతికేరోజులు పోయినయ్. బాపయ్య అనుసరిస్తూ వచ్చిన ఆదర్శాలూ, గడించిన కీర్తి అక్కరకు రాలేదు. తను కష్టపడి సంపాదించిన సౌరాజ్యం

కాకులూ, గద్దలూ పొడుచుకు తింటున్నట్లుగా అయింది.

రాజకీయ బాధితులకు పొలాలు యిస్తున్నారన్న వార్త వినగానే బాపయ్య హృదయంలో సంచలనం కలిగింది. తనకంటే వెనక, అదీ పోకేవొక్కసారి జైలుకు వెళ్ళి వచ్చిన వారికికూడా పొలాలు యిచ్చారు. అదిచూ బాపయ్యకూడా దరఖాస్తు పెట్టాడు.

ఊరు పోరంబోకల్లోని పొలం అంతా అప్పటికే రాజకీయ బాధితులు పంచుకోవడం అయింది. బాపయ్యకు పక్కవూరు రాళ్ళపల్లి గ్రామకంఠంలో వున్న పదెకరాల పొలం యిచ్చారు. అందులో ఐదెకరాల మాజీ మిలటరీ వాడొకడు సేద్యం చేసుకొంటున్నాడు. మిగతా ఐదెకరాలు బీడువడి వుంది. ఆ బీట్లో ఊళ్ళోవాళ్ళంతా వుమ్మడిగా గొడ్లు మేపుకొంటూన్నారు.

బాపయ్య తనవాళ్ళతో వెళ్ళి ఆ పొలాల్ని ఆక్రమించుకోటానికి ప్రయత్నించగా రాళ్ళపల్లి గ్రామస్థులూ, మాజీ మిలటరీవాడూ కర్రలు తీసుకొచ్చారు.

బాపయ్యకు శివమెత్తిపోయింది. శాసనోల్లంఘనంచేసి జైలుకు పోయినరోజుల్నాటి వుద్రేకం, పట్టుదల బాపయ్య నరాల్లో మళ్ళీ ప్రవేసించింది. పెద్ద పెద్ద వుద్యోగుల్ని పట్టుకొని పోలీసుల సహాయంతో, తనకిచ్చిన పొలంలో అరక కట్టి దున్నించి వచ్చాడు.

పరాజయం పొందిన రాళ్ళపల్లి గ్రామస్థులు బాపయ్య మీదే కాకుండా, బాపయ్య ఊళ్ళోవున్న బాపయ్య ఆప్తుల మీదకూడా పగపట్టారు.

బాపయ్యకూ, సాంబయ్యకూ బీరకాయ పీచులాటి బంధుత్వం వుంది. బాపయ్య అరకకట్టిన రోజున సాంబయ్య కూడా వంకె కర్ర తీసుకుపోయి చేనుగట్టున్న నుంచున్నాడు.

సాంబయ్యకు వూళ్ళో యే రాజకీయాలూ అంతగా వంట పట్టలేదు. బాపయ్య జయిలుకు పోయిన రోజుల్లోకూడా సాంబయ్య వొడ్డున నుంచునే చూశాడు.

కాని, గత పంచాయితీ ఎలక్షన్లతో సాంబయ్య, బాపయ్యకు ఎదురైనాడు. వూళ్ళో వీధికొక ముఠాగా చీలిపోయారు.

ఎలక్షన్లలో సాంబయ్య ముఠావాళ్ళు ఓడిపోయారు.

వూరు ఊరుగా లేదు. కసిపట్టి పగలు సాధించుకొంటున్నారు.

దానికి తోడుగా, భూస్వాములంతా కౌలుదారీ బిల్లు వస్తుందేమోనన్న భయంతో పొలాలు కౌలుకివ్వడం మానేసి సొంతంగా వ్యవసాయం చేయించడం మొదలు పెట్టారు. పొలాలు పోయిన కౌలుదార్లంతా బుసలుకొట్టూన్నారు.

ఒక రోజు రాత్రి బాపయ్య మూడెకరాల్లోని వరికుప్ప నిప్పుముట్టుకొంది!

ఊళ్లో జనంఅంతా వెళ్ళిపడి రాజుకొంటూన్న నిప్పును ఆర్పేసి వచ్చారు.

ఊళ్ళో మాలక్ష్మమ్మ చెట్టుకింద చర్చలు సాగినై.

"ఇది రాళ్ళపల్లి వాళ్ళపనే!" అని గట్టిగా వాదించాడు సాంబయ్య.

వారం తిరక్కముందే వోరోజు రాత్రి సాంబయ్య ముప్పై ఎకరాల పంటకుప్ప పూర్తిగా కాలిపోయింది.

కాలి మసయిపోయిన పంటకుప్పను చూసి నిలువునా నీరయిపోయాడు సాంబయ్య.

సాంబయ్య అసలే కోపిష్టిమనిషి. నోటిదగ్గరకొచ్చిన పంట నాశనం అయిపోయింది. అతడి కడుపు తరుక్కుపోతోంది. గుండెలు దహించుకు పోతూన్నాయి. కోపాన్ని, కసిని కడుపులోనే పెట్టుకొని పిచ్చెత్తినవాడిలా తిరుగుతున్నాడు.

సాంబయ్య కుప్ప దగ్ధమయిపోయిన మూడోరోజు రాత్రి యింకా నాలుగైదు కుప్పలు తగలబడిపోయినై.

ఊళ్ళోజనం భయంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొన్నారు. నోరు తెరిచి ఏమంటే ఏంవస్తుందో, ఎవరికొంప ముట్టుకుంటుందోనన్న భీతితో నోళ్ళు నొక్కుకొని తిరుగుతున్నారు.

ఎవడు మిత్రుడో, యెవరు శత్రువో తెలియడంలేదు. చిల్లర తగాదాల్లో పెరిగిన కక్షలున్నకూడా ఈ రూపంలో సాధించుకొంటున్నట్టుగా వుంది. మనిషిని చూస్తే మనిషికి అనుమానం! భయం!

ప్రశాంత గ్రామజీవితం ధ్వంసం అయింది. గ్రామస్థుల్లో అశాంతి రాజుకు పోతూవుంది.

* * *

ఆ రోజు సాయంకాలం శివాలయం ముందు పెద్ద తలకాయలన్నీ చేరినై.

మెల్లగా గుసగుసలతో ఆరంభమైన సంభాషణ పెద్దగా అరుచుకునేదాకా సాగింది.

"ఇది మంచికి రాలేదు" అన్నాడు సాంబయ్య.

"మనం దద్దమ్మలమై చేతులు ముడుచుక్కూచోబట్టే యిలా జరుగుతోంది!" అన్నాడు బాపయ్య.

తోకతొక్కిన తాచులా శివాలయం మండపంమీద నుంచి వొక్కదూకు దూకాడు సాంబయ్య.

సాంబయ్య కడుపులో మండుతోన్న దావాగ్నికి దోవ దొరికింది.

"దౌర్భాగ్యపు వెధవా! నువ్వేరా ఊరుకు నాశనం తెచ్చావ్" అంటూ సాంబయ్య, బాపయ్యమీదికి దూకి చేతికర్ర విసిరాడు.

అలా కొట్టూన్నంతసేపూ బాపయ్య నిర్విణ్ణుడయి పోయి నుంచున్నాడు. అక్కడ చేరినవాళ్ళల్లో అదేమన్న వాళ్ళులేరు. చూస్తూ కూర్చున్నారు.

సాంబయ్య బాపయ్యను నాలుగు దెబ్బలేసి, కాండ్రించి వూసి తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు.

అక్కడ చేరినవాళ్ళు పైపంచలు దులుపుకొని ఎవరి దారిన వాళ్ళు ఇళ్ళకు వెళ్ళిపోయారు.

సూర్యుడస్తమించబోతున్నాడు. దేవాలయం గోపురపు నీడలు పక్కనున్న కోనేటిలో కలిసిపోతున్నాయి.

బాపయ్య హృదయం గాయపడింది.

సాంబయ్య కొట్టిన దెబ్బలు హృదయానికే తగిలినట్టయింది.

బాపయ్య అభిమానం దెబ్బతిన్నది. తన గౌరవం, పెద్దరికం మంటకలిసిపోయింది. ఇంక ఏ మొహంతో బజార్నే నడిచి యింటికి వెళ్తాడు.

తలవంచుకొని, ఆలోచిస్తూ మెల్లగా శివాలయం వెనక్కు నడిచి వెళ్లాడు. కాళ్ళు నేలమీద ఆనుతూన్నట్టుగా లేదు. కళ్లు బయర్లు కమ్మిపోతున్నాయి. గోపురం విరిగి తన నెత్తినే పడుతూన్నట్టనిపించింది !

శివాలయం వెనక ఆలయం గోడకానుకొని జారగిల బడ్డాడు.

జరిగిన సంఘటనను తలచుకొంటూంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగినై.

అంత అన్యాయం జరుగుతూంటే వొక్కళ్ళు అడ్డమొచ్చిన పాపాన పోలేదు. తను యెంత గౌరవంగా బతికాడు ? ఊరుకోసం, దేశంకోసం ఎంత త్యాగం చేశాడు ?

ఇరవై సంవత్సరాలనాడు ఆ శివాలయంముందే అదే చోటున తన్ను పోలీసులు లాఠీచార్జి చేస్తుంటే జనం తన కోసం ఎంత పరితపించారు ?

బాపయ్య తన గత చరిత్రలో జరిగిపోయిన సంఘటనల తాలూకు దృశ్యాల్ని శివాలయం గోడమీద చిత్రించుకొని చూస్తూ,ఏదో తెలియని అనుభూతుల్లో మునిగిపోయాడు.

శివాలయంలో గంటలు మోగినయ్! బాపయ్య పైపంచతో కళ్ళు తుడుచుకొని లేచి నుంచొని యింటికి బయలు దేరాడు.